## కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ రద్దు చేయాలి..

- రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు ఇవ్వాలి
- ఓయూ జేఏసీ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ డిమాండ్




**దశ, ఓయూ:** కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ, పాలిటెక్నిక్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఉన్న మొత్తం ప్రక్రియను రద్దు చేయాలని ఓయూ జేఏసీ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరాయి. ఈ డిమాండ్లతో మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రధాన గ్రంథాలయం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు ఓయూ జేఏసీ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో భారీ నిరుద్యోగుల ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర నాయకులు జార్జిరెడ్డి, ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్. నాగేశ్వరరావు, ఎన్. సుమంత్, కె. స్వాతి మాట్లాడుతూ 2023లో చేపట్టిన కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. నకిలీ ధ్రువపత్రాలు, తప్పుడు పత్రాల ఆధారంగా పలువురు క్రమబద్ధీకరణ పొందారని, ఇందులో అధికారుల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. మొత్తం ప్రక్రియపై నిష్పక్షపాత విచారణ జరిపి, అవసరమైతే క్రమబద్ధీకరణను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంట్రాక్ట్ లెక్చరర్లకు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులకు తుది తీర్పు వచ్చే వరకు వేతన పెంపులు మంజూరు చేయరాదని కూడా వారు కోరారు.రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ నిరుద్యోగులకు న్యాయం జరగడం లేదని వారు విమర్శించారు. పోలీసు శాఖలో సుమారు 20 వేల ఖాళీలు ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ, ప్రభుత్వం కేవలం ఐదు వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వాలని భావించడం నిరుద్యోగుల పట్ల అన్యాయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని అన్ని ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, అలాగే ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కూడా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగులకు న్యాయం చేయకపోతే, కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణను రద్దు చేయకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వం నిరుద్యోగుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వేదాంత్ మౌర్య, రంజిత్ రెడ్డి, విజయ్, చేతన్, బాలకృష్ణ, శ్రీను, నూతన్, రమేష్, అజయ్, మనోహర్, దివ్య, ప్రసన్న, అనురాధతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.



## ఓటరు హక్కుల పరిరక్షణే లక్ష్యం...

- SIRపై ఇంటింటికీ, సోషల్ మీడియాలో సిద్ధంకి కృష్ణారెడ్డి ప్రచారం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు



**దశ, రంగారెడ్డి:** ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంపై తాజా మాజీ కౌన్సిలర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సిద్ధంకి కృష్ణారెడ్డి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలను మరింత ముమ్మరం చేశారు.

ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలో పేరు నమోదు, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, వివరాల సవరణ, తప్పుల సరిదిద్దడం వంటి అంశాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైన పత్రాలు, దరఖాస్తు ఫారాలు, వాటిని నింపే విధానం, BLOలకు సమర్పించే ప్రక్రియపై ప్రజలకు వివరించి, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

అదే సమయంలో ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా SIR ప్రత్యేక సవరణ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటర్లకు అవసరమైన సమాచారం, సూచనలు, గడువులు, నమోదు ప్రక్రియకు సంబంధించిన వివరాలను నిరంతరం ప్రజలకు చేరవేస్తూ చైతన్యం కల్పిస్తున్నారు.

ప్రజల నుంచి వచ్చే సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేస్తూ, అవసరమైన చోట సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా సిద్ధంకి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, "ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచనల మేరకు ప్రతి అర్హుడి ఓటు నమోదు కావడం, ప్రతి కుటుంబానికి SIRపై పూర్తి అవగాహన కల్పించడం మా బాధ్యత. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా సరిచేసుకోవాలి. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి బలమైన ఆయుధం" అని అన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేయొద్దు

- విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి: బీసీ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిరి భీమ్‌రాజ్
- ఆర్. కృష్ణయ్య పిలుపుతో హయత్‌నగర్‌లో కళాశాలల బంద్ విజయవంతం



**దశ, హైదరాబాద్:** విద్యార్థుల ఉన్నత విద్యకు ఎంతో దోహదపడుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేయకుండా యథావిధిగా కొనసాగించాలని బీసీ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిరి భీమ్‌రాజ్ ప్రభుత్వాన్ని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు మంగళవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్‌లో భాగంగా హయత్‌నగర్‌లోని పలు కళాశాలల వద్ద విద్యార్థులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎత్తిరి భీమ్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్ విజయవంతమైందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 14 లక్షల మంది బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలుగా రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం స్పందించకపోతే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎత్తిరి భీమ్‌రాజ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులతో పాటు బీసీ సంఘం నాయకులు మణి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన లక్ష్యం: వొడితల ప్రణవ్

- నిరుపేద లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది
- సంక్షేమ పథకాల విషయంలో పారదర్శకత పాటిస్తున్నాం
- ఎవరైనా డబ్బులు అడిగితే కఠిన చర్యలు తప్పవు



**దశ, హుజూరాబాద్ :** ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పాలనలో నిరుపేదలైన లబ్ధిదారులకు సంక్షేమం అభివృద్ధి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.మంగళవారం హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 82 మంది,30 లక్షల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు నేరుగా అందజేశారు.నిరుపేదలు పరిస్థితి బాగోలేక ఆసుపత్రులపాలైన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కుల రూపంలో అండగా ఉంటుందని,ఇప్పటివరకు హుజూరాబాద్ లో సుమారు 10కోట్ల రూపాయల చెక్కులు పంపిణీ చేశామని ప్రణవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో పారదర్శకతను పాటిస్తున్నామని త్వరలో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వబోతున్నామని అన్నారు. సంక్షేమ పథకాల విషయంలో ఏవరైనా డబ్బులు అడిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రణవ్ అన్నారు.ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ప్రజా ప్రజాప్రతినిధులు,మండలాల అధ్యక్షులు,అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్



**దశ, ఓయూ:** ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్ అన్నారు.మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం తార్నాక లోని పలు ప్రాంతాల్లో బిఎల్ఓ అఖిల తో కలిసి పర్యటించి ఇంటి ఇంటికి తిరుగుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పిస్తు ఎన్యూమరేషన్ పాత్రలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు ఉన్నా వెంటనే సరిచేసుకోవాలని పేర్కొన్నారు.

## డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలి

- జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్



**దశ, హైదరాబాద్ :** శేరిలింగంపల్లి జోన్‌లో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇంజనీరింగ్ విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు నియమించిన ఎన్‌సీపీఈ కన్సల్టెంట్ ప్రతినిధులతో కలిసి జోన్ పరిధిలోని డ్రైనేజీ నెట్‌వర్క్, నీటి ప్రవాహ విధానం (హైడ్రాలిక్స్), ప్రధాన, ఉప నాలాల ప్రస్తుత పరిస్థితిపై సమగ్రంగా చర్చించారు. కన్సల్టెంట్ సమర్పించిన సాంకేతిక నివేదికను పరిశీలిస్తూ, డ్రైనేజీ నెట్‌వర్క్ మ్యాపింగ్, నీటి ప్రవాహ సామర్థ్యం, వరద ముంపు ప్రాంతాల పరిస్థితిని సమీక్షించారు. ముఖ్యంగా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఉన్న డ్రైన్ల సామర్థ్యాన్ని పెంచడం, నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్న అవరోధాలను తొలగించడం, హైడ్రాలిక్ డిజైన్‌ను ఆధునీకరించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు.

## ప్రభుత్వ భూమి, నాలా ఆక్రమణపై విచారణ
## జరపాలి: మాజీ ఎంపీటీసీ విష్ణుగౌడ్ ఫిర్యాదు



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** బాటసింగారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 106లో ప్రభుత్వ భూమి, నాలా (వాగు) భూమిని అక్రమంగా ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారంటూ స్థానిక ఓ ప్రజాప్రతినిధిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ బండిగారి విష్ణుగౌడ్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.విష్ణుగౌడ్ తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, బాటసింగారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 106 సమీపంలో అనాజ్‌పూర్ నుంచి కొత్తగూడెం వరకు వెళ్లే సుమారు 10 అడుగుల వెడల్పు గల నాలా ఉందన్నారు. ఆ నాలాను ఆనుకొని సుమారు 10 గుంటల ప్రభుత్వ భూమి ఉండేదని, గతంలో రైతులు ఆ స్థలాన్ని వడ్లు ఆరబెట్టుకునేందుకు వినియోగించుకునేవారని తెలిపారు. అయితే ఓ ప్రజాప్రతినిధి తప్పుడు పత్రాలను సృష్టించి ఆ ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని కడీలు నాటినట్లు ఆరోపించారు. అలాగే నాలాలోని కొంత భాగాన్ని మట్టితో పూడ్చి ఆక్రమించి అక్కడ కూడా కడీలు నాటినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వ భూమి, నాలాను పరిరక్షించాలని కోరారు. అలాగే బాటసింగారం, కొత్తగూడెం గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను భినామీల పేర్లతో ఆక్రమిస్తున్నారనే ఆరోపణలపై కూడా విచారణ జరిపి, అక్రమాలు రుజువైతే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించేందుకు అధికారులు తక్షణమే స్పందించి, వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ విష్ణుగౌడ్ విజ్ఞప్తి చేశారు.

## ప్రజలంతా ఐక్యమత్యంతో జీవించాలి

**దశ, మునగాల:** ప్రజలంతా కులమత భేదాభిప్రాయాలు విడి ఐక్యమత్యంతో జీవిస్తూ గ్రామీణ పల్లెల్లో గ్రామ స్వరాజ్యాన్ని సాధించాలని నరసింహపురం గ్రామ సర్పంచ్ వేమూరి సత్యనారాయణ అన్నారు.

మంగళవారం మండల పరిధిలోనినర్సింహాపురం గ్రామంలోదళిత కాలనీలో పౌరహక్కుల దినం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ. దళితులు ప్రభుత్వంఅందించేసంక్షేమపథకాలనుసద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు, ప్రభుత్వం ఇప్పటికే దళితుల్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాల్ని అందిస్తుందని వాటిని ఉపయోగించుకుంటూ గ్రామీణ ప్రాంతంలోని దళితులు వృద్ధిలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు,

## ఓటర్ల జాబితా క్రమబద్ధీకరణకు విశేష స్పందన

- ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్లు.. ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన.

**దశ పెద్ద అంబర్ పేట :** ఓటర్ల జాబితా క్రమబద్ధీకరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మల్లెపాక మల్లేష్, నాయకులు చంద్రగొని గోవర్ధన్ గౌడ్ పాల్గొని ఓటర్ల జాబితా ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరిశీలించాలని, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అర్హులైన యువత కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రతి ఓటరు తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించడంతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలపై అధికారుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని మాజీ కౌన్సిలర్లు పేర్కొన్నారు.



జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
బుధవారం 01-07-2026

# ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఖమ్మం | వైరా | సత్తుపల్లి | పాలేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం | కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట
WWW.DASHANEWS.COM



# 'సేవ్ మణుగూరు' పిలుపుతో పట్టణ బంద్ విజయవంతం



**దశ, మణుగూరు:** 'సేవ్ మణుగూరు' పేరుతో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మణుగూరు పట్టణ బంద్ మంగళవారం విజయవంతంగా జరిగింది. బంద్ సందర్భంగా అఖిలపక్ష నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఐ నాయకుడు దుర్గ్యాల సుధాకర్, టీడీపీ నాయకుడు వాసిరెడ్డి చలపతిరావు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు రూపురెడ్డి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పీకే ఓసీ డిప్‌సైడ్ బ్లాక్‌ను ప్రైవేటీకరించకుండా సింగరేణికే కేటాయించాలని, మణుగూరు ఓసీ ఎక్స్‌టెన్షన్‌కు తక్షణమే అనుమతులు తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 1974లో పీకే1 ఇన్‌క్లైన్ బొగ్గు గని ప్రారంభమైనప్పటి నుంచి పీకే2, పీకే3, ఓసీ1, ఓసీ2, ఓసీ3, ఓసీ4 ప్రాజెక్టులతో మణుగూరు అభివృద్ధి చెందిందని వారు గుర్తు చేశారు. వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు వ్యాపారాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, పట్టణ ఆర్థిక వ్యవస్థ సింగరేణిపై ఆధారపడి అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మణుగూరులో కేవలం రెండు గనులే పనిచేస్తున్నాయని, డిప్‌సైడ్ బ్లాక్‌ను ప్రైవేటుకు అప్పగిస్తే కార్మికులను ఇతర ప్రాంతాలకు తరలించే పరిస్థితి ఏర్పడి, ప్రాంత అభివృద్ధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మరో 25 సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్న నేపథ్యంలో వాటిని సింగరేణి ద్వారానే వినియోగించాలని కోరారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే అప్పగించాలని, లేనిపక్షంలో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. బంద్‌కు చాంబర్ ఆఫ్ కామర్స్, వివిధ వ్యాపార సంఘాలు, కూరగాయల మార్కెట్ వ్యాపారులు, హోటల్ యజమానులు, విద్యాసంస్థలు, పీవీ కాలనీ వ్యాపారులు, పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి దుకాణాలు మూసివేశారు. కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, సీపీఐ మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, ఏఐటీయూసీ నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, తోట రమేష్, సింగరేణి కార్మిక సంఘాల నాయకులు, టీడీపీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతోనే గ్రామ పంచాయతీ అభివృద్ధి: సర్పంచ్ తాటి వాణి



**దశ బూర్గంపాడు:** గ్రామపంచాయతీ అభివృద్ధి చెందాలంటే పంచాయతీ ప్రజల సహకారంతో అభివృద్ధి జరుగుతుందని సర్పంచ్ తాటి వాణి అన్నారు. మంగళవారం బూర్గంపాడు మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తాటి వాణి మీడియాతో మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి అనేది ఒక వ్యక్తి వల్ల సాధ్యమయ్యే పని కాదని, ప్రజల భాగస్వామ్యం, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అధికారుల సహకారం కలిసివస్తేనే గ్రామం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని తెలిపారు. గత ఆరు నెలల కాలంలో కృష్ణసాగర్ గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను చేపట్టామని గ్రామంలోని మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం ,తాగునీటి సమస్య పరిష్కారం, వీధుల అభివృద్ధి, విద్యుత్ సౌకర్యాల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలలో నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడమే తన లక్ష్యమని అన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరేలా ప్రత్యేక దృష్టి సారుస్తామని గ్రామంలో ఎలాంటి సమస్య వచ్చిన వెంటనే స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని అన్నారు. అభివృద్ధి పనుల్లో రాజకీయాలకు అతీతంగా అందరిని కలుపుకొని ముందుకు సాగుతున్నామన్నారు. కృష్ణసాగర్ పంచాయతీ ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలంటే ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ప్రజలు సలహాలు సూచనలు అందించడంలో పాటు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆమె కోరారు. గ్రామ భవిష్యత్ కోసం తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజల సంక్షేమమే దృష్టిలో పెట్టుకునే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల నమ్మకమే తన బలం అని అన్నారు. ప్రజలుఅందరి ఆశీస్సులు సహకారంతో కృష్ణ సాగర్ గ్రామపంచాయతీ మరింత అభివృద్ధి పదంలో నడిపిస్తామని గ్రామ అభివృద్ధి కోసమే తాను ఎప్పుడు అందుబాటులోనే ఉంటానని అందరం కలిసి కృష్ణ సాగర్ గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామపంచాయతీ తీర్చిదిద్దుదాం అని సర్పంచ్ తాటి వాణి పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధి అనేది నిరంతరం ప్రక్రియ అని, ప్రజల భాగస్వామ్యంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి కృష్ణ సాగర్ పంచాయతీ ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తన ధ్యేయమని ఆమె పేర్కొన్నారు.

## సొంతింటి కలను సాకారం చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**దశ, మణుగూరు:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాల సొంతింటి కల నెరవేరుతోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పీకే1 సెంటర్, విఠల్‌నగర్‌కు చెందిన అర్హులైన లబ్ధిదారురాలు పిట్టల లక్ష్మి నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి మంగళవారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో సొంతింటిని నిర్మించుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఏరియా ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రతకు



**దశ, మణుగూరు:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు పరిశుభ్రమైన వాతావరణం అవసరమని, ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పాయం వెంకటేశ్వర్లు సూచించినట్లు సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని 1వ వార్డులో ఉన్న ప్రభుత్వ 100 పడకల ఏరియా ఆస్పత్రి పరిసర ప్రాంతాలను మంగళవారం జేసీబీ యంత్రంతో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ పాల్గొని పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల నివారణతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రి పరిసరాల్లో చెత్త, పొదలను తొలగించడం ద్వారా రోగులు, ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం రవి, వత్సవాయి కొండబాబు, శ్రీనివాస్, భద్రయ్య, రాంబాబు, అశోక్‌నగర్ యువజన సభ్యులు నిఖిల్ చారి, రవి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే సమ్మెకు కారణం: సీపీఎం నాయకులు




**దశ, మణుగూరు:** సింగరేణి అధికారుల సమ్మెకు సీపీఎం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సీపీఎం మణుగూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు నెల్లూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ, సింగరేణి అధికారులు తమ విధులను విడిచి రోడ్డుపైకి వచ్చి ప్రత్యక్ష పోరాటం చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడటానికి కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యమే ప్రధాన కారణమని విమర్శించారు.

సింగరేణి అధికారులు తమ సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఉప ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ చట్టబద్ధమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం, యాజమాన్యం విఫలమయ్యాయని ఆయన అన్నారు. దీంతో అధికారులు విధులను పక్కనబెట్టి ప్రత్యక్ష పోరాటాన్ని చేపట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల అధికారులు ఆర్థిక, సేవాపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి అధికారుల సంఘం చేపట్టిన న్యాయమైన ఉద్యమానికి సీపీఎం పూర్తి మద్దతుగా నిలుస్తుందని, వారి పోరాటానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, సీనియర్ నాయకుడు ఎస్. వెంకట్రావు, ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

## మునగాల పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐ నియామకం చేయాలి

❖ సీపీఎం నేత ములకలపల్లి రాములు డిమాండ్




**దశ, మునగాల:** మునగాల పోలీస్ స్టేషన్‌కు కొత్త ఎస్ఐ నియామకం లేక దాదాపు రెండు నెలలు గడుస్తుండటంతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గతంలో మునగాల ఎస్ఐగా పనిచేసిన ప్రవీణ్ కుమార్ మఠంపల్లికి ఏప్రిల్ నెలలో బదిలీ అయినప్పటి నుంచి ఇప్పటివరకు కొత్త ఎస్ఐను నియమించకపోవడంతో పోలీస్ సేవలు ప్రభావితమవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. మండలంలోని 22 గ్రామపంచాయతీలు, 10 ఆవాస గ్రామాలతో పాటు 65వ నెంబర్ జాతీయ రహదారి 18 కిలోమీటర్ల మేర విస్తరించి ఉండటంతో రోజూ రోడ్డు ప్రమాదాలు, వివిధ వివాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే నరసింహుల గూడెం, జగన్నాధపురం, కలకోవ, నారాయణగూడెం, తాడువాయి, నేలమర్రి, మాధవరం వంటి గ్రామాలు తరచూ రాజకీయ, భూ వివాదాలతో ఘర్షణలకు లోనవుతున్నాయని పేర్కొంటున్నారు. స్టేషన్‌లో అధికారి లేకపోవడంతో బాధితులు న్యాయం కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా పోలీస్ శాఖతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎస్ఐ నియామకంపై అధికార పార్టీ నాయకుల జోక్యం, పైరవీలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

# సారపాక లో భారీగా పట్టుబడిన గంజాయి..

❖ భారీ గంజాయి రాకెట్ గుట్టురట్టు

❖ ఈగల్ ఫోర్స్ మెరుపు దాడులు.

❖ పుష్ప సినిమా మరిపించేలా రవాణా..



**దశ బూర్గంపాడు:** రాష్ట్రంలో మాదక ద్రవ్యాల రవాణాపై ఈగల్ ఫోర్స్ పోలీసులు చేపట్టిన వరుస మెరుగు దాడుల్లో భారీ స్థాయిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పుష్ప సినిమా మాదిరిగా లారీలో గంజాయి రవాణా కు అధికారులు చెక్ పెట్టారు. అత్యంత వేగంగా వ్యూహాత్మకంగా నిర్వహించిన ఈ ఆపరేషన్లు అంతరాష్ట్ర గంజాయి రాకెట్పై కీలక దెబ్బగా నిలిచాయి. తాజా ఘటనలో బూర్గంపాడు మండలం సారపాక సమీపం లో మంగళవారం కంటైనర్లో అక్రమంగా తరలిస్తున్న 525 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ దాడి ఈగల్ ఫోర్స్, స్థానిక పోలీసుల సంయుక్త ఆపరేషన్లో జరిగింది. ఈ గంజాయి విలువ సుమారు కోట్ల రూపాయలుగా అంచనా వేయబడింది. అంతకు ముందు నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లలో కూడా ఈగల్ఫోర్స్ కీలక విజయాలు సాధించింది. ఒడిశా నుంచి తెలంగాణ మీదుగా రహస్యంగా తరలిస్తున్న సుమారు రూ.2.5 కోట్ల విలువైన 500 కిలోల గంజాయిని పోలీసులు సరిహద్దు ప్రాంతాల నుంచి 80కిలోల మీటర్ల మేర ఛేజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈఘటనలో ముఠా కదలికలను గమనించి సమయోచితంగా చర్యలు తీసుకోవడం ద్వారా పెద్ద నెట్వర్క్ భగ్నం చేశారు. ఈగల్ ఫోర్స్ అధికారులు అత్యంత వేగంగా స్పందిస్తూ, ఆధునిక సాంకేతిక, గూఢచారి సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు.

వరుస విజయాలతో మాదకద్రవ్యాల రవాణా ముఠాలకు పెద్ద ఎదురు దెబ్బ తగిలినట్లయింది. పట్టుబడిన కేసులపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని, అంతరాష్ట్ర నెట్వర్క్ న్ను పూర్తిగా ఛేదించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. గంజాయి రవాణా సరిహద్దులు దాటుతూ రాష్ట్రాల నుండి ఇతర రాష్ట్రాలకు రవాణా కొత్త కొత్త మార్గాల ద్వారా జరుగుతున్న నేపథ్యంలో ఈగల్ టీమ్స్ ప్రత్యేక దృష్టి సారించి మెరుపు దాడులతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు. తాజాగా సారపాక గ్రామంలో పట్టుబడ్డ గంజాయి, లారీ, నిందితుల్ని అదుపులో తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు.